క్లుప్తంగా

నగర పంచాయతీ కమిషనర్‌గా రవివర్మ



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవివర్మను అభినందిస్తున్న కార్యాలయ సిబ్బంది

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్‌గా పిన్నమరాజు రవివర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ నగర కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన రవివర్మను పలువురు కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ అన్నదాన ట్రస్టుకు సోమవారం ఎదుర్లంక గ్రామానికి చెందిన చిలువూరి సత్యవతి రూ.10,116లు ఆలయ సిబ్బందికి విరాళంగా అందజేశారు. దాతను ఆలయ మర్యాదలతో సత్కరించారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

అయ్యప్పకు పదునెట్టాంబడి బహూకరణ

ముమ్మిడివరం: ముమ్మిడివరం శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి ఓ భక్తుడు సుమారు రూ.25 వేల విలువైన పదునెట్టాంబడిని బహూకరించారు. ఆలయ వ్యవస్థాపకులు పెన్మత్స జగ్గప్పరాజు గురుస్వామి అల్లుడు మహీధరవర్మ స్వామి వీటిని సమకూర్చారు. సోమవారం ఆలయ అర్చకులు పవన్‌శర్మకు అందజేయగా ఆయన ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ముందు అలంకరించారు.

సాహితీ సమావేశాలకు వేదికలు ఉచితం

యానాం: యానాంలో జరిగే సాహితీ, సాంస్కృతిక సమావేశాలకు ఇకపై ఉచితంగా ప్రభుత్వ ఆధీనంలోని వేదికలను ఇవ్వడానికి జీఓను సాధించిన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు ప్రముఖకవి దాట్ల దేవదానంరాజు, పానుగుమట్ల విష్ణుమూర్తి, నామాడి అప్పారావు, పెనుమాక రత్నాకర్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఏపీ, తెలంగాణాల్లో రాష్ట్ర ప్రభుత్వాలు సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికలను ఉచితంగా ఇస్తుందని యానాంలో కూడా ఇవ్వాలని మల్లాడి కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లినట్లు వారు చెప్పారు. దానికి ఆయన స్పందించారన్నారు. సీఎం రంగసామి దృష్టికి తీసుకువెళ్లి వేదికలను ఉచితంగా ఉపయోగించుకునేలా సంబంధింత జీఓను విద్యాశాఖ డైరెక్టర్‌కు జారీ చేశారన్నారు.

కుండలేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

కాట్రేనికోన: కార్తికమాసం రెండో సోమవారం పురస్కరించుకొని పార్వతీ సమేత కుండలేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వేకువ జామునే గౌతమీ గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన మహిళలు రావి చెట్టు చుట్టూ ప్రదర్శనలు చేసి దీపారాధన చేశారు. అనంతరం పార్వతీ సమేత కుండలేశ్వరుని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నిమ్మకాయల జగ్గయ్యనాయుడు ఆర్థిక సహాయంతో ఆలయం వద్ద సామూహిక అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

మత్స్యకారులకు పరిహారం అందించండి

యానాం: వేట నష్టపోయిన మత్స్యకారులకు చెల్లించాల్సిన నష్ట పరిహారంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న 231 మంది లబ్ధిదారులకు అందించాల్సిన మొత్తాన్ని త్వరితగతిన ప్రభుత్వ ఖాతాలో వేయాలని సోమవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీఎస్సార్ పనులకు సంబంధించి 25 పనులకు గానూ 23 పనులకు టెండర్లు పిలిచినట్లు మల్లాడి తెలిపారు.

భవిత కేంద్రం పరిశీలన

ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న భవిత విద్యా కేంద్రాన్ని జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ ఎం.వి.వి.సత్యనారాయణ సోమవారం సందర్శించారు. దివ్యాంగ పిల్లలను పరిశీలించి వారి తల్లితండ్రులతో మాట్లాడారు. పిల్లల హాజరు, రికార్డులను పరిశీలించారు. ప్రతివారం జరిగే ఫిజియోథెరపీ క్యాంపును ఉపయోగించుకోవాలని కోరారు. ఏఎంవో పి.రాంబాబు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు జి.రవివర్మ, పావని, కాంప్లెక్స్ సీఆర్‌ఎంటీ కె.నారాయణరావు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకులపై బైండోవర్ కేసులు

అమలాపురం టౌన్: నలుగురు బెల్ట్‌షాపు నిర్వాహకులపై స్థానిక ఎక్సైజ్ అధికారులు బైండోవర్ కేసులు నమోదు చేసి వారిని అమలాపురం తహసీల్దార్ కిషోర్‌బాబు ఎదుట సోమవారం హాజరు పరిచినట్లు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ష్యూరిటీ విధించారని పేర్కొన్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్ ఆదేశాల మేరకు బైండోవర్ చేసినట్లు ఎస్సై బాలాజీ చెప్పారు.

నిర్లక్ష్యం నీడలో శ్మశాన వాటికలు

- కనీస వసతులు కరవు
- డ్రైన్లు, కాలువ గట్లపైనే అంతిమ సంస్కారాలు
- చివరి మజిలీకి తప్పని తిప్పలు

అల్లవరం: శ్మశాన వాటికల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. సంపన్నుడైనా, కటిక పేదవాడైనా చివరికి అందరూ అక్కడికి చేరాల్సిందే. అటువంటి శ్మశాన వాటికలను అభివృద్ధి చేయటంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

అల్లవరం మండలంలో దేవగుప్తం, డి.రావులపాలెం, గుండెపూడి, రెల్లుగడ్డ, తూర్పులంక గ్రామాలకు లోయర్ కౌశిక డ్రైను గట్టే శశ్మాన వాటికగా మారింది. ఎన్నో ఏళ్లుగా లోయర్ డ్రైన్ గట్టునే శ్మశాన వాటికగా ఉపయోగిస్తూ అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే మోకాళ్ల లోతు మట్టిలో మృతదేహాలను తీసుకెళ్లడం కష్టతరంగా మారుతోంది. పోనీ మిగిలిన రోజులైనా బాగుంటుందా అంటే ఆక్వా రైతుల పుణ్యమా అని దారులన్నీ ధ్వంసమవుతున్నాయి. దేవగుప్తం, డి.రావులపాలెం నుంచి శ్మశానానికి వెళ్లే దారిలో చెరువు నుంచి ఊటనీరు దారిపై ప్రవహించి నడవటానికి వీల్లేకుండా ఉంది. ఓడలరేవు, కొమరగిరిపట్నాల వారు సముద్ర తీర ప్రాంతాల్లోనూ, బోడసకుర్రు, గోడితిప్ప, గోడిలంక, బెండమూర్లంక గ్రామాలవారు వైనతేయ నది, కుమ్మరికాలువ గట్లపై శ్మశాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎస్సీ గ్రామాలైతే మరింత అధ్వానంగా ఉన్నాయి. ఉప్పలగుప్తం మండలంలో భీమనపల్లి, విలసవిల్లి,



చెరువు ఊటనీరు రోడ్డుపైకి రావడంతో ధ్వంసమైన దేవగుప్తం శ్మశాన వాటిక రహదారి



రూ.15 లక్షలతో మొగళ్లమూరులో నిర్మించిన శ్మశాన వాటిక



సౌకర్యాలు లేని వాడపర్రు శ్మశాన వాటిక

గోపవరం, చల్లపల్లి, ఎస్.యానం, కొత్తపల్లి, వానపల్లిపాలెం గ్రామాల్లో ఊరు చివర కాలువ, డ్రైను గట్లను శ్మశాన వాటికలుగా నిర్వహిస్తున్నారు.

ప్రతిపాదనలతోనే సరి

దశాబ్దాల పాటు కనీస సౌకర్యాలకు నోచుకోని శ్మశాన వాటికలు పదుల సంఖ్యలో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎంపీ చింతా అనురాధ చొరవతో అమలాపురం, అల్లవరం, అయినవిల్లి మండలాల్లో ఎంపీ నిధులతో శ్మశాన వాటికలను అభివృద్ధి చేశారు. మరి కొన్ని శశ్మాన వాటికల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో శ్మశానాల అభివృద్ధిని తుంగలో తొక్కారు. కూటమి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే శ్మశానాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శ్మశాన వాటికలను అభివృద్ధి చేసిన గ్రామాలు	ఖర్చు చేసిన ఎంపీ నిధులు
అల్లవరం	రూ.10 లక్షలు
రెబ్బనపల్లి	రూ. 9 లక్షలు
అమలాపురం	రూ.10 లక్షలు
మొగళ్లమూరు	రూ. 15 లక్షలు
ముక్తేశ్వరం	రూ.10 లక్షలు
కొమరగిరిపట్నం	రూ.11 లక్షలు (సీఎస్సార్ నిధులు)

వర్షాలు పడితే అవస్థలు



గోడి గ్రామంలో మూడు శ్మశాన వాటికలు ఉన్నాయి. బీసీ, ఎస్సీ కులాల వారు డ్రైను గట్లపైనే ఖననం చేయాల్సి వస్తోంది. కనీస సౌకర్యాలు లేవు. వర్షాకాలం వస్తే శవాన్ని దహనం చేయడానికి పడే బాధలు చెప్పలేనంతగా ఉంటాయి. ప్రతి గ్రామంలో శ్మశానవాటికలకు పక్కా భవనాలు, దహనం చేయడానికి కనీస సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి.

రేవు శ్రీనివాసరావు, గోడి, అల్లవరం మండలం

ఘనంగా జాతీయ విద్యాదినోత్సవం



అమలాపురంలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు బులినాని తదితరులు



యానాంలో ఆజాద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

అమలాపురం టౌన్: స్థానిక 13వ వార్డు గొల్లగూడెంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల వద్ద జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా జరిగింది. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంత్యుత్సవం, మైనార్టీల సంక్షేమ దినోత్సవాన్ని సైతం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొయిద్దీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి 13వ వార్డు కౌన్సిలర్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో గల భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ మహనీయుని జయంతి రోజునే జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీల సంక్షేమ దినోత్సవాలను జరుపుకోవడం జాతికి ఒకే రోజు మూడు పండగలు జరిగినట్లుగా ఉందని పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణంలోని మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విగ్రహం వద్ద జరిగిన మరో కార్యక్రమానికి అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథూర్ హాజరయ్యారు. ఆజాద్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

యానాం: దేశంలో ఉన్నత విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం సమాచార శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఫెర్రీ రోడ్డులో ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, జీజీహెచ్ డిడి రవిశంకర్, ఎస్పీ రాజశేఖరన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, పీఆర్ఏ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుంటే ఆందోళన తప్పదు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎస్.యానం గ్రామస్తులు

కలెక్టరేట్ వద్ద ఎస్.యానం గ్రామస్తుల నిరసన

అమలాపురం రూరల్: ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం గ్రామాన్ని అభివృద్ధి చేయకుండా వేదాంత ఆయిల్ కంపెనీ నిర్లక్ష్యం వహిస్తోందని స్థానిక నిరుద్యోగులకు ఉపాధి చూపకుండా అన్యాయం చేస్తోందని సోమవారం కలెక్టరేట్ వద్ద గ్రామ ప్రజలు నిరసన తెలిపారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వేల కోట్ల రూపాయల చమురు నిక్షేపాలు తరలించుకు పోతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వేదాంత ఆయిల్ కంపెనీ ఎస్.యానం గ్రామాన్ని అభివృద్ధి చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని, ఇచ్చిన హామీలు తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీసం తాగునీరు కూడా పూర్తి స్థాయిలో అందించకుండా స్థానికులకు అన్యాయం చేస్తోందన్నారు. పది రోజుల్లో తమ డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో వేదాంత ఆయిల్ కంపెనీ కార్యకలాపాలు స్తంభింపజేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రీవెన్స్ సెల్‌లో అధికారులకు వినతిపత్రం అందించారు.

గ్రామాభివృద్ధి చేసి ఉపాధి కల్పించాలి

ఉప్పలగుప్తం: ఎస్ యానం గ్రామాన్ని అభివృద్ధి చేసి గ్రామస్తులకు ఉపాధి కల్పించాలంటూ ఆ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గత 30 ఏళ్లగా చమురు నిక్షేపాలు వెలికితీసి వేల కోట్లు రూపాయలు తరలించుకుపోతూ తమ గ్రామ ప్రజల ఉపాధి దెబ్బతీసిన వేదాంతా ఆయిల్ కంపెనీ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించకుండా అన్యాయం చేస్తుందని తక్షణమే గ్రామ నిరుద్యోగులకు ఉపాధి కల్పించి అభివృద్ధి చెయ్యాలని డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సుబ్రహ్మణ్యంకు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు



ప్రత్యేక అలంకరణలో పిల్లంక కాశీ అన్నపూర్ణేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామి



తాళ్లరేవులో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

తాళ్లరేవు: పవిత్ర కార్తికమాసం రెండవ సోమవారాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని శివాలయాలకు తెల్లవారు జామునుంచి భక్తులు పోటెత్తారు. పవిత్ర నదీ స్నానాలాచరించి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. తాళ్లరేవులోని పురాతన శివాలయంలో అర్చకులు కొండవీటి శివరామకృష్ణ ఆధ్వర్యంలో శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. చొల్లంగి రాజరాజేశ్వరీ సహిత సోమేశ్వరస్వామి, పటవల, పిల్లంక గ్రామాల్లోని శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరీ సహిత విశ్వేశ్వరస్వామి, పాతకోరంగి కురంగేశ్వరస్వామి, పటవల సర్వమంగళ కాశీ అన్నపూర్ణేశ్వరీ సమేత విశ్వేశ్వరస్వామి, నీలపల్లి నీలకంఠేశ్వర స్వామి, ఇంజరం ఉమా కృపేశ్వరస్వామి, ఉప్పంగల రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి విశేష పూజలు చేశారు.

అగ్ని ప్రమాదంలో రేకుషెడ్లు దగ్ధం

ఇరువురికి స్వల్ప గాయాలు

అమలాపురం రూరల్: బండారులంకలో వీరభద్ర స్వామి గుడి వద్ద సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు రేకు షెడ్లు దగ్ధమైన ఘటనలో రెండు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరు స్వల్ప గాయలతో బయటపడ్డారు. దీపం బుడ్డి కారణంగా ప్రమాదం సంభవించింది. మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా ఇంట్లో ఉన్నవారు ప్రాణభయంతో పరుగులు తీశారు. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో విలువైన గృహోపకరణాలు మంటల్లో కాలి దగ్ధమయ్యాయి. రూ 1.50 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. అమలాపురం అగ్నిమాపక అధికారి మురళి కొండబాబు, లీడ్ ఫైర్‌మెన్ మట్టపర్తి బలరాం ఆధ్వర్యంలో అగ్నిమాప సిబ్బంది మంటలు అదుపు చేశారు.

హరహర మహాదేవ.. శంభో శంకర



అమలాపురంలోని రామలింగేశ్వరునికి పంచామృతాలతో అభిషేకం చేస్తున్న అర్చకులు



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ బేడా మండపంలో అభిషేకాలు చేస్తున్న పండితులు



బండారులంకలో స్వామికి అభిషేకం చేస్తున్న శ్రీశైల దేవస్థానం మాజీ ట్రస్టీ శంకరమూర్తి



కొత్తపల్లిలో ప్రత్యేక అలంకరణలో ఉమా బ్రహ్మేశ్వరస్వామి

- భక్తిశ్రద్ధలతో కార్తికమాసం రెండో సోమవారం పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- మహాదేవునికి ప్రత్యేక అభిషేకాలు
- పలుచోట్ల అన్నసమారాధనలు

అమలాపురం టౌన్: పవిత్ర కార్తిక మాసం రెండో సోమవారం శైవక్షేత్రాలు శివనామంతో మార్మోగాయి. హరహర మహాదేవ..శంభో శంకర అంటూ గొంతెత్తిన భక్తజనం పారవశ్యం చెందారు. అమలాపురం పట్టణంలోని శివాలయాలన్నీ సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. శివలింగాలకు పంచామృతాలతో అర్చకస్వాములు అభిషేకాలు చేస్తుంటే భక్తులు తిలకించి పులకించిపోయారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అనువంశిక ధర్మకర్తల చైర్మన్ మాచిరాజు రవికుమార్‌తోపాటు అర్చకులు శివలింగానికి పాలు, పెరుగు, పలు పళ్ల రసాలతో అభిషేకించారు. పురాతన శివక్షేత్రం చెన్న మల్లేశ్వరస్వామి, చంద్రమౌళీశ్వర స్వామి, సిద్ధేశ్వరస్వామి, నాగ లింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు స్వామి దర్శనాల కోసం బారులు తీరారు. సోమవారం సాయంత్రం ఆయా శివలయాల ప్రాంగణాల్లో మహిళలు కార్తిక దీపాలు వెలిగించి ఆలయాలను కాంతిమయం చేశారు. స్థానిక మెయిన్ రోడ్డులో గల సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శివ లింగాన్ని భక్తులు తాకే సంప్రదాయం ఉండడంతో ఆ లింగాన్ని తాకి పూజలు చేసేందుకు భక్తులు ఎగబడ్డారు.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

ముమ్మిడివరం: కార్తికమాసం రెండవ సోమవారం భక్తులు ఆలయాలకు పోటెత్తారు. వేకువ జాము నుంచే వృద్ధ గౌతమీ నదీపాయలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కార్తిక దీపారాధనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండలంలో అయినాపురం శ్రీ ఉమా సోమేశ్వరస్వామి, అన్నంపల్లి శ్రీపార్వతీ గౌతమేశ్వరస్వామి, కొమానపల్లి శ్రీపార్వతీ సమేత చోడేశ్వరస్వామి, లోకేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

రామలింగేశ్వరునికి అభిషేకాలు

అల్లవరం: కార్తికమాసం రెండో సోమవారం మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం తెల్లవారు జాము నుంచి పెద్ద ఎత్తున శివాలయాలకు బారులు తీశారు. కార్తిక దీపాలు వెలిగించి పార్వతీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. రామలక్ష్మణులచే ప్రతిష్ఠింపబడి భక్తులతో పూజలందుకుంటున్న ఎస్.రామేశ్వరంలోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి, లక్ష్మణేశ్వరంలోని పార్వతీ సమేత లక్ష్మణేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు చేశారు. కొమరగిరిపట్నంలో బాలాత్రిపుర సుందరీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. దేవగుప్తంలో ఎంతో విశిష్టత చెందిన ఉమా సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయాన్ని దేవగుప్తం పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పరమేశ్వరుడిని భక్తి శ్రద్ధలతో కొలిచారు. బోడసకుర్రు, ఎంట్రుకోన, తాడికోన, గోడి, బెండమూర్లంక, అల్లవరం గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు.

ఐ.పోలవరం: శివనామ సంస్మరణలతో మండలంలోని శివాలయాలు మార్మోగాయి. నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న ప్రముఖ పుణ్య క్షేత్రం మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయం భక్తులతో జనసంద్రంగా మారింది. కార్తికమాస రెండో సోమవారం కావడంతో మండలం నుంచే కాక జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. తెల్లవారు జామునుంచి పవిత్ర వృద్ధ గౌతమీ గోదావరి ఘాట్‌లలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ఆవరణలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తిక దీపాలను ఆలయంలో తులసి కోట వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పంచహారతిలో వెలిగించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా రెండు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పంచామృత అభిషేకాలు, లఘు న్యాస పూర్వక ఏకవార అభిషేకాలు జరిగాయి. అన్నదానం ఏర్పాటు చేశారు.కేశనకుర్రుపాలెం రాజరాజేశ్వరీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామికి పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. టి.కొత్తపల్లి, ఐ.పోలవరం, కేశనకుర్రు, జి.వేమవరం, ఎదుర్లంక గ్రామల్లోని శివాలయాల్లో పూజలు నిర్వహించారు.

అమలాపురం రూరల్: కార్తికమాసం రెండో సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. తెల్లవారు జాము మూడు గంటల నుంచే శివాలయాల్లో శివనామ స్మరణం మొదలైంది. అభిషేకాలు, పూజలతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడాయి. పాత బండారులంకలో భువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి శివలింగానికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. గుమ్మడి సద్గుర సత్యనారాయణ అధ్వర్యంలో పిచ్చిక వెంకన్న, చింతా ఉమా, కొండా చంటి పూజలు చేశారు. నడిపూడిలో వేంచేసియున్న అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమపూజ నిర్వహించారు. అన్నసమాధన నిర్వహించారు.

ఉప్పలగుప్తం: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని ఎస్.కొత్తపల్లి, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం, మునిపల్లి, విలసవిల్లి, భీమనపల్లి, చల్లపల్లి గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్.కొత్తపల్లిలో ఉమా బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో పురోహితుడు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలంటూ ఆందోళన



మద్యం దుకాణం తొలగించాలని ఆందోళన చేపడుతున్న కార్మికులు

అమలాపురం రూరల్: అమలాపురం మండలం కామనగరువు బైపాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగిచాలని ఆమని ఆటో ఏజెన్సీస్ కార్మికులు, గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. కామనగరువు బైపాస్‌రోడ్‌ను ఆనుకొని ఏర్పాటు చేసిన వైన్‌షాప్ వల్ల ఆమని ఆటో ఏజెన్సీలో పని చేస్తున్న కార్మికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మద్యం షాపు పక్కనే ఆలయం ఉన్నందున భక్తులకు అసౌకర్యం కలగడమే కాక దారిన వెళ్లే స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులకు ప్రతిబంధకంగా మారిందన్నారు. అధికారులు స్పందించి మద్యం షాపును వేరే చోటికి మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు మోటూరి వెంకటేశ్వరరావు, వర్రే నానాజీ, వర్రే కాశీ, పెమ్మిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

అమలాపురం టౌన్: ఓ గర్భిరిర్భిణి ఆరోగ్య పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో అమలాపురం నుంచి కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో సోమవారం తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే ప్రసవించింది. అమలాపురం రూరల్ మండలం నడిపూడికి చెందిన బి.సంగీత (20) గర్భిణి కావడంతో అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యం తీసుకుంటోంది. తలసేమియాతో రక్తం తక్కువగా ఉండడంతో పాటు గర్భంలోని శిశువు మెడకు ప్రేగు చుట్టుకున్న విపత్కర పరిస్థితిలో ఉన్నత వైద్యం కోసం ఆమెను కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి అమలాపురం ఏరియా ఆస్పత్రి వైద్యులు సిఫార్సు చేశారు. దీంతో 108 అంబులెన్స్‌లో ఆమెను కాకినాడ తీసుకొని వెళుతుండగా పాండిచ్చేరి-యానాం వద్దకు చేరుకునేసరికి పురిటి నొప్పులు వచ్చాయి. అంబులెన్స్‌లో గర్భిణీతో పాటు ఉన్న ఎమర్జన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) జె.రాధ, ఆశా వర్కర్ లక్ష్మి స్పందించి ఆమెను ప్రసవించేలా అందులోనే ఏర్పాట్లు చేశారు. ఆమె ఆరోగ్యవంతమైన మగ బిడ్డకు జన్మనిచ్చింది.

వైభవంగా రామయజ్ఞం

అమలాపురం టౌన్: లోకా సమస్తా సుఖినోభవంతు ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ పర్యవేక్షణలో అమలాపురం రూరల్ మండలం ఎ.వేమవరం గ్రామ శివారు శ్రీరామపేట రామాలయంలో శ్రీరామయజ్ఞం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త కుమార్ శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ఆర్థిక భారంతో ధార్మిక క్రతువులకు దూరమవుతున్న సామాన్యులు, పేదలకు భగవంతుని సేవలో అవకాశం కల్పించాలనే భావంతో నూట ఎనిమిది శ్రీరామ యజ్ఞాలు చేయాలని సంకల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో నేరేడుమిల్లి శ్రీరాములు, కుసుమ రామకృష్ణ, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్‌పై ఫిర్యాదు

ముమ్మిడివరం: ఎండీయూ వాహనాల వద్ద నిర్ణయించిన ధర కంటే అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఒక లబ్ధిదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు వాంగ్మూలం నమోదు చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలెంలో రేషన్ సరఫరా చేసే ఎండీయూ ఆపరేటర్ జనిపెళ్ల నవీన్‌కుమార్ కందిపప్పు, పంచదారలకు ప్రభుత్వ నిర్ణయించిన ధరల కంటే అధికంగా సొమ్ము వసూలు చేస్తున్నాడని ఆ గ్రామానికి చెందిన లబ్ధిదారుడు చింతా రామకృష్ణ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

16న న్యాయ అవగాహన సదస్సు

అమలాపురం రూరల్: ఈ నెల 16న అయినవిల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళలతో న్యాయ అవగాహన సదస్సు నిర్వహిస్తునట్లు మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి వి నరేష్ సోమవారం పేర్కొన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ సదస్సులో మహిళా చట్టాలు, మహిళల హక్కులు, రక్షణ తదితర అంశాలపై అవగాహన కలిస్తారని తెలిపారు. మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరిశ్రమల డైరెక్టర్‌గా రుద్రగౌడ

యానాం: పరిశ్రమలు, వాణిజ్యశాఖల డైరెక్టర్‌గా పుదుచ్చేరి సివిల్ సర్వీసెస్ కేడర్ అధికారి పిటి రుద్రగౌడను నియమిస్తూ సోమవారం ఎల్జీ కె కైలాష నాథన్ ఆదేశాలు జారీ చేశారని ప్రభుత్వ కార్యదర్శి వి జయశంకర్ తెలిపారు. ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా ఎఎస్ శివకుమార్, స్టేషనరీ అండ్ ప్రింటింగ్ కార్యదర్శిగా టి సుధాకర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డైరెక్టర్‌గా శివరాజ్‌మీనా, ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్‌గా అమన్ శర్మ, డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా ఎమ్ ఆదర్శ్‌ను నియమించారన్నారు. ఈ మేరకు సంబంధిత ఆదేశాలు యానాం ఆర్ఏఓ కార్యాలయానికి అందాయి.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన

ఉప్పలగుప్తం: విద్యార్థినులు చట్టాలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సీహెచ్.రాజేష్ అన్నారు. మండలంలోని భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై సోమవారం అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం నూకల సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాయి వెంకటేశ్వరరావు, కామన మధుసూదనరావు, అరవ స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.